సాక్షి ఒడిశా

శుక్రవారం । 3 । నవంబర్ । 2023



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

నగదు	రూ.3,46,031
బంగారం	9 గ్రాముల 550 మిల్లీ గ్రాములు
వెండి	48 గ్రాముల 500 మిల్లీ గ్రాములు

- భువనేశ్వర్/పూరీ



ద్విచక్ర వాహనాల నిందితుడు అరెస్టు

పర్లాకిమిడి రైల్వేస్టేషన్‌లో కొన్ని రోజులుగా మాయమవుతున్న ద్విచక్ర వాహనాల కేసుకు సంబంధించి శ్రీకాకుళం జిల్లా టెక్కలి గ్రామానికి చెందిన హరిశ్చంద్ర బెహరాను పోలీసులు అరెస్టు చేశారు.

- 4లో.



జూనియర్ డాక్టర్స్ ఆందోళన

మల్కన్‌గిరి జిల్లాలోని కలిమెల ఆరోగ్య కేంద్రంలో పనిచేస్తున్న జూనియర్ డాక్టర్లు ఆరోగ్య కేంద్రం ఎదుట గురువారం ఆందోళన చేపట్టారు.

- 4లో.

న్యూస్‌రీల్

విజిలెన్స్ వలలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్



విజిలెన్స్ అధికారులకు చిక్కిన సురాజ్

మల్కన్‌గిరి: జిల్లాలోని కలిమెల సమితి మోటు తహసీల్ పరిధిలో పనిచేస్తున్న రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సురాజ్ చంద్రబాల గురువారం ఒక వ్యక్తి వద్ద నుంచి రూ.15 వేల లంచం తీసుకుంటూ పట్టుబడ్డాడు. వివరాల్లోకి వెళ్తే.. స్థలాన్ని రిజిస్ట్రేషన్ చేయడానికి సురాజ్ రూ.15 వేల లంచాన్ని ఒక వ్యక్తి వద్ద నుంచి డిమాండ్ చేశాడు. దీంతో విజిలెన్స్ అధికారులకు సమాచారం ఇచ్చారు. వారి ప్లాన్ ప్రకారం గురువారం ఉదయం కార్యాలయం తెరిచిన వెంటనే సదరు వ్యక్తి రూ.15 వేల డబ్బులను సురాజ్‌కి ఇచ్చాడు. వెంటనే విజిలెన్స్ అధికారులు వచ్చి కేసు నమోదు చేశారు. ప్రస్తుతం సురాజ్‌ను కొరాపుట్ విజిలెన్స్ కార్యాలయానికి తరలించి విచారణ జరుపుతున్నారు.

గంజాయి పట్టివేత



అరెస్టు చేసిన వ్యక్తులను చూపిస్తున్న పోలీసులు

బరంపురం: నగరానికి అక్రమంగా రవాణా చేస్తున్న గంజాయిని సురడా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఐఐసీ అధికారి గీతాంజలి సాహు తెలిపిన వివరాల మేరకు.. కొందమాల్ జిల్లా దరింగబడి నుంచి బరంపురం నగరానికి ద్విచక్ర వాహనంతో అక్రమంగా గంజాయి తరలిస్తున్నట్లు పోలీసులకు ముందస్తు సమాచారం అందింది. దీంతో సురడా పోలీసులు వాహన తనిఖీలు చేపట్టారు. దీనిలో భాగంగా అనుమానంతో ఒక ద్విచక్ర వాహనాన్ని ఆపి సోదాలు నిర్వహించగా 28 కిలోల గంజాయితో 2 బ్యాగులు బయటపడ్డాయి. దీంతో బైక్‌పై ఉన్నటువంటి ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేశారు. స్వాధీనం చేసుకున్న గంజాయి సుమారు రూ.3 లక్షలు ఉంటుందని తెలియజేశారు.

ఓవర్ లోడ్‌తో వెళ్తున్న టిప్పర్లు స్వాధీనం



పోలీసులు స్వాధీనం చేసుకున్న టిప్పర్

రాయగడ: జిల్లాలోని కాసీపూర్ సమితి టికిరిలో ఓవర్ లోడ్‌తో వెళ్తున్న మూడు టిప్పర్లను టికిరి పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. గురువారం వాహన తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో వీటిని పట్టుకున్నట్లు తెలియజేశారు. స్వాధీనం చేసుకున్న వాహనాలను పోలీసుస్టేషన్‌కు తరలించారు. అనంతరం రీజనల్ ట్రాన్స్‌పోర్టు కార్యాలయ అధికారులకు సమాచారాన్ని అందించారు. అక్కడికి చేరుకున్న ఆర్టీవో అధికారులు 3 టిప్పర్లకు రూ.1.23 లక్షల జరిమానా విధించారు.

కింగ్ కోబ్రా కలకలం



పట్టుబడిన 10 అడుగుల కింగ్ కోబ్రా

బరంపురం: జిల్లాలోని దిగపండి దగ్గర పెందురబడి గ్రామాల్లో 10 అడుగుల కింగ్ కోబ్రా కలకలం సృష్టించింది. స్థానికుల సమాచారంతో స్నేక్ హెల్ప్‌లైన్ సంస్థకి చెందిన ఆశిరాజ్ చాకచక్యంతో కింగ్ కోబ్రాను పట్టుకున్నారు. అనంతరం దిగపండి అటవీ విభాగం దగ్గరలో ఉన్న చందుడిదేవ్ అటవీ ప్రాంతంలో విడిచిపెట్టారు. దీంతో గ్రామస్తులు ఒక్కసారిగా ఊపిరి పీల్చుకున్నారు.

చిట్టి తాబేలుకు గట్టిమేలు



- తీరానికి ఆలివ్ రిడ్లేల ఆగమనం
- చేపల వేట నిషేధించిన ప్రభుత్వం
- మత్స్యకారులకు పరిహారం

భువనేశ్వర్: సముద్ర తీర ప్రాంతాలకు తాబేళ్ల (ఆలివ్ రిడ్లే) ఆగమనం ఆరంభమైంది. ఈ మేరకు తాబేళ్ల సంతానోత్పత్తి మరియు సంభోగం సమయంలో వాటి భద్రతకు సత్వర చర్యలు చేపట్టారు. ఆలివ్ రిడ్లే ప్రధానంగా సంతానోత్పత్తి కోసం విచ్చేసే ధామ్రా, దేవి మరియు రుషికుల్య నదీ, సముద్ర సంగమ తీరాల్లో చేపల వేట నిషేధానికి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఉత్తర్వులు తక్షణమే అమలవుతాయని ప్రకటించింది. తీర ప్రాంతాల్లో 20 కిలోమీటర్ల పరిధిలో సముద్రంలో చేపల వేట కార్యకలాపాలపై 7 నెలల నిషేధాన్ని విధించారు. వచ్చే ఏడాది మే 31వ తేదీ వరకు ఈ ఆంక్షలు నిరవధికంగా కొనసాగుతాయని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

సంభోగ సమయం

లక్షలాది ఆలివ్ రిడ్లే తాబేళ్లు సంభోగం మరియు గుడ్లు పెట్టడం కోసం ప్రతీ సంవత్సరం నవంబర్ నుంచి జనవరి వరకు ధామ్రా, దేవి మరియు రుషికుల్య నదీ, సముద్ర సంగమ తీర ప్రాంతాలు సందర్శిస్తాయి. ఈ కాలంలో రుషికుల్య నది ముఖద్వారానికి ఇరువైపులా 10 కి.మీ పరిధిలో, తీరానికి 20 కి.మీ పరిధిలో యాంత్రిక, మోటారు పడవలతో చేపలు వేటాడడం నిషేధించినట్లు గంజాం మెరైన్ విభాగం అదనపు మత్స్యశాఖ అధికారి సుబ్రత్ పట్నాయక్ తెలిపారు.

పరిహారం చెల్లింపు

చేపల వేట నిషేధం కారణంగా అనుబంధ మత్స్యకారులకు ప్రభుత్వం పరిహారం చెల్లించింది. ఒక్కో మత్స్యకారుని కుటుంబానికి ఏక విడత చెల్లింపు కింద ప్రభుత్వం రూ.15,000 పరిహారం అందజేస్తుందని ఆయన తెలిపారు. తాబేళ్లు చేపలు పట్టే వలల్లో చిక్కుకోవడం లేదా చేపల వేట ట్రాలర్ల కింద చిక్కుకోవడం వంటి విపత్తులతో పెద్ద సంఖ్యలో చనిపోవడం వంటి సంఘటనలు చోటు చేసుకుంటాయి. ఈ నేపథ్యంలో నిషేధం ఆంక్షలు విధించినట్లు అధికారి వివరించారు.


గహీర్మతలో నిరవధిక ఆంక్షలు

అంతరించిపోతున్న ఆలివ్ రిడ్లే తాబేళ్ల సంతతి పునరుద్ధరణ, సంరక్షణకు అనుకూలమైన గహీర్మత తీరంలో ఏడాది పొడవునా చేపల వేట ఆంక్షలు కార్యాచరణలో కొనసాగించడం విశేషం. ఆలివ్ రిడ్లే సంతతికి ఈ తీరం ప్రసిద్ధి చెందింది. ఈ నేపథ్యంలో ఈ తీరానికి అభయారణ్యం హోదా కల్పించారు. ఆడ తాబేళ్లు గుడ్లు పెట్టడం కోసం సాధారణంగా రాత్రిపూట తీర ప్రాంతాలకు చేరుతాయి. పొదిగేందుకు అనుకూలమైన చోట్ల గుడ్లని పెడతాయి. గుడ్లు పెట్టిన తర్వాత తీరం వీడి లోతైన సముద్రం లోతుకి తాబేళ్లు చేరుకుంటాయి. అనంతరం 45 నుంచి 60 రోజుల్లో ఈ గుడ్ల నుంచి పొదిగిన పిల్లలు బయటకు వస్తాయి.

ప్రత్యేక నిఘా ఏర్పాటు

నిషేధం ఉత్తర్వుల ఉల్లంఘన నివారణకు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. ఈ ప్రక్రియలో కోస్ట్ గార్డు సిబ్బందితో పాటు అటవీ, మత్స్య మరియు సముద్ర తీర ఠాణా పోలీసులతో కూడిన బృందాలు బహుళ స్థాయి పెట్రోలింగ్ నిర్వహిస్తారు. సముద్ర తాబేళ్ల సంరక్షణ కోసం చేపల వేటపై నిషేధం ఉన్న సమయంలో పెట్రోలింగ్‌ను పర్యవేక్షించేందుకు నోడల్ అధికారిగా డిప్యూటీ డైరెక్టర్ (మెరైన్) కమ్ అడ్జుడికేటింగ్ ఆఫీసర్ ఆఫ్ ఫిషరీస్ డైరెక్టరేట్‌ని నియమించారు. మత్స్య శాఖ వాటాదారుల మధ్య కాలానుగుణ అవగాహన శిబిరాలను నిర్వహణ ఖరారు చేశారు. కోస్టుగార్డు, అటవీ మరియు మెరైన్ ఠాణా పోలీసు అధికారులు చేపల వేట నిషేధంపై మత్స్యకారులకు అవగాహన కల్పిస్తారు.

పుల్బణిలో పెద్దపులి



రహదారి మధ్య సంచరిస్తున్న పెద్దపులి

బరంపురం: ఎప్పుడూ మావోయిస్టులు-సీఆర్పీఎఫ్ జవాన్ల కాల్పులతో దద్దరిల్లే కొందమాల్ జిల్లాలో పెద్దపులి ప్రకంపనలు సృష్టిస్తోంది. ఆదివాసీ గ్రామాల్లో తిరుగుతుండడంతో భయానక వాతావరణం నెలకొంది. బాధిత గ్రామస్తులు మరియు అటవీ అధికారులు తెలిపిన వివరాల మేరకు.. బుధవారం రాత్రి కొందమాల్ జిల్లా బల్లిగుడా ఉప జిల్లా పాలన పరిధి బెల్లగడా అటవీ రేంజ్ చుట్టుపక్కల గ్రామాల్లో పెద్దపులి బీభత్సం సృష్టించింది. బెల్లగడా గ్రామంలో భీకరమైన గాండ్రింపులతో ఆవుల శాలలో ఉన్న లేగ దూడని నోటితో కరిచి అడవిలోకి తీసుకెళ్లిపోయింది. గతవారం గజపతి జిల్లా మోహన అటవీ ప్రాంతాల్లో సుమారు ఐదుకి పైగా ఆవులపై దాడిచేసిన విషయం మరవకముందే, మరోసారి పులిపంజా విసరడంతో స్థానికులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా బుధవారం రాత్రి బల్లిగుడా-పుల్బాణి మధ్య జాతీయ రహదారిపై పెద్దపులి తిరుగుతున్న దృశ్యం చూసినట్లు డ్రైవర్ రామహరి నాయక్ తెలియజేశారు. బస్సుకి ఎదురుగా వచ్చిన పెద్దపులిపై లైట్ వేసి హారన్ కొట్టడంతో తిరిగి అడవిలోకి వెళ్లిపోయినట్లు ప్రత్యక్ష సాక్షులు తెలియజేస్తున్నారు. సమాచారం అందుకున్న పుల్బాణి కేంద్రం అటవీ డివిజన్ అధికారులు సంఘటన స్థలానికి చేరుకొని బెలగడా గ్రామ శివారులో పరిశీలించగా లేగ దూడను పెద్దపులి తినేసినట్లు గమనించారు. దీనిపై అటవీ అధికారులు ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు.



దర్యాప్తు చేస్తున్న పుల్బణి అటవీ అధికారులు

నిజాయితీతో అవినీతి నిర్మూలన



ప్రసంగిస్తున్న రాష్ట్ర సీబీఐ వ్యవహారాల ఇన్‌చార్జి మణీష్ వీరేష్

భువనేశ్వర్: ప్రతి ఒక్కరూ నిజాయితీగా వ్యవహరిస్తే అవినీతిని నిర్మూలించడం సాధ్యమని రాష్ట్ర సీబీఐ వ్యవహారాల ఇన్‌చార్జి మణీష్ వీరేష్ అన్నారు. స్థానిక భారతీయ సాంకేతిక సంస్థ (ఐఐటీ) గురువారం ఏర్పాటు చేసిన విజిలెన్స్ అవగాహన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు.

కేంద్ర విజిలెన్స్ కమిషన్ పిలుపు మేరకు గత నెల 30వ తేదీ నుంచి ఈనెల 5వ తేదీ వరకు విజిలెన్స్ వారోత్సవాలు నిర్వహిస్తున్నారు. అవినీతి నివారణతో జాతికి అంకితం కావాలనే నినాదంతో ఈ ఏడాది దేశవ్యాప్తంగా విజిలెన్సు అవగాహన వారం కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఐఐటీ భువనేశ్వర్ డైరెక్టర్ ప్రొఫెసర్ శ్రీపాద్ కర్మల్కర్ మాట్లాడుతూ.. దేశంలోని భావి పౌరులకు వివిధ రకాల అవినీతిపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. భవిష్యత్‌లో పనిచేసే చోట ఈ దురాచారాలతో పోరాడేందుకు సన్నద్ధం కావాలని ఉద్బోధించారు. అవినీతి నిర్మూలనలో ఉపాధ్యాయులు మరియు విద్యాసంస్థల పాత్రను నొక్కి చెప్పారు. సదస్సు నిర్వాహక సంస్థ చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ ప్రొఫెసర్ ప్రభాస్ రంజన్ సాహు అతిథులకు స్వాగతం పలికారు. అనంతరం ఐఐటీ సిబ్బంది, అధికారులతో సమగ్రతా ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ బామదేవ్ ఆచార్య, సీనియర్ అధ్యాపకులు, ఇన్‌స్టిట్యూట్ సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో రైతులకు మొండిచేయి

- బీజేపీ కృషక్ మోర్చా అధ్యక్షుడు మహేశ్వర్ సాహు



మాట్లాడుతున్న మహేశ్వర్ సాహు, వేదికపై మదల, కిషోర్ పండ తదితరులు

రాయగడ: వ్యవసాయ రంగానికి పెద్దపీట వేస్తున్నట్లు ప్రకటనలు గుప్పిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం, వాస్తవానికి రైతులకు మొండిచేయి చూపిస్తోందని బీజేపీ కృషక్ మోర్చా రాష్ట్ర శాఖ అధ్యక్షుడు మహేశ్వర్ సాహు ఆరోపించారు. స్థానిక సిరికోన సమీపంలోని బీజేపీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన కృషక్ మోర్చా కార్యవర్గ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రైతులకు సకాలంలో సాగునీరు అందకపోవడంతో పంటలు నాశనం అవుతుంటే, నవీన్ ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందని ధ్వజమెత్తారు. వ్యవసాయ రంగాన్ని ఆదుకునేందుకు వివిధ సంక్షేమ పథకాల ద్వారా కేంద్ర ప్రభుత్వం రూ.కోట్లు మంజూరు చేస్తున్నప్పటికీ, వాటిని రైతులకు అందించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమవుతోందని మండిపడ్డారు. సంక్షేమ పథకాలను దారి మళ్లించి అవినీతికి పాల్పడుతోందని పేర్కొన్నారు. ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యాన్ని విక్రయించేందుకు రైతులు పడుతున్న బాధలు వర్ణనాతీతమని ఆవేదన వ్యక్తం చేశారు. పేరుకే మండీలు ఏర్పాటు చేస్తున్నారని, మండీలకు రైతులు ధాన్యం తీసుకెళ్తే అక్కడ నెలల తరబడి వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొందని దుమ్మెత్తిపోశారు. రాయగడ జిల్లాలో ఇంతవరకు శీతల గిడ్డంగులు లేకపోవడంతో రైతులు పండించిన పంటలు భద్రపరుచుకునేందుకు ఇబ్బంది పడుతున్నారన్నారు. రైతులపై శీతకన్ను వేస్తున్న ఈ ప్రభుత్వానికి రానున్న ఎన్నికల్లో చరమగీతం పాడాలని పిలుపునిచ్చారు.

వ్యూహాత్మకంగా ముందుకెళ్తాం

రానున్న ఎన్నికలకు బీజేపీ వ్యూహాత్మకంగా ముందుకెళ్తుందని సాహు తెలియజేశారు. రాష్ట్రంలో తమ పార్టీకి మంచి రోజులు వస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. నవీన్ పాలనలో ప్రజలు విసుగెత్తిపోయారని, ప్రస్తుతం రాష్ట్ర ప్రజలు మార్పు కోరుకుంటున్నారని పేర్కొన్నారు. ఏది ఏమైనప్పటికీ రాష్ట్రంలో బీజేపీకి అనుకూల పవనాలు వీస్తున్నాయన్నారు. త్వరలో రాష్ట్రంలోని అన్ని పంచాయతీల్లో కృషక్ మోర్చా సమావేశాలను నిర్వహించి, పార్టీ విజయానికి తమ వంతు కృషి చేస్తామని తెలియజేశారు. సమావేశంలో కృషక్ మోర్చా రాష్ట్రశాఖ కార్యదర్శి ఉపేంద్ర భంజ, ఎగ్జిక్యూటివ్ సభ్యులు జగన్నాథ్ మహాపాత్రో, రజత్ మదల, రాజ్ ప్రసాద్, కృషక్ మోర్చా జిల్లా శాఖ అధ్యక్షుడు కృష్ణచంద్ర పండ, బీజేపీ జిల్లా సాధారణ కార్యదర్శి కిషోర్ పండ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న కృషక్ మోర్చా సభ్యులు, మహిళా కార్యకర్తలు

అందాలలో మహోదయం



అలరిస్తున్న ఆదివాసీ డాన్స్‌లు



పర్వతంపై పర్యాటక స్థలం

- పుటసిల్‌లో ఇకో రిట్రీట్ ఏర్పాటు
- కనువిందు చేస్తున్న ప్రకృతి సోయగాలు

జయపురం: కొరాపుట్ జిల్లా ప్రకృతి అందాలకు నిలయం. ఇక్కడి అందాలను చూసేందుకు ప్రతి ఏడాది శీతాకాలంలో పర్యాటకులు పోటెత్తుతుంటారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలోనే ఎత్తైన దేవమాలి పర్వత ప్రాంతంలోని పుటసిల్‌లో ఇకో రిట్రీట్‌ను సీఎం నవీన్ పట్నాయక్ వర్చువల్‌గా బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కొరాపుట్ ఎమ్మెల్యే రఘురాం పడాల్ మాట్లాడుతూ.. ఇకో రిట్రీట్‌లో రాష్ట్ర పర్యాటక విభాగం పర్యాటకుల కోసం 28 అధునాతన కాటేజీలు ఏర్పాటు చేసిందని వెల్లడించారు. పర్యాటకులకు రుచికరమైన ఆహారంతో పాటు ఆహ్లాదకరమైన సుందర వాతావరణాన్ని ఆస్వాదించేందుకు తగిన సౌకర్యాలు కల్పించినట్లు పేర్కొన్నారు. అలాగే రాత్రులందు చక్కని సాంస్కృతిక కార్యక్రమాలతో ఉత్సాహపరచడం జరుగుతుందని వెల్లడించారు. పర్యాటకులకు ఈ ప్రాంతం భూతల స్వర్గమని తెలియజేశారు.

ఆకట్టుకునే జలపాతాలు

ఈ ప్రాంతంలో దట్టమైన అడవులు, జలపాతాలు పర్యాటకులను అమితంగా ఆకట్టుకుంటాయి. ఈ పర్యాటక కేంద్రం వలన పరిసర ప్రాంతాలు అభివృద్ధి చెందడంతో పాటు అనేక మందికి ఉపాధి లభించి, వారి ఆర్థిక ప్రగతికి దోహదపడుతుందని ఎమ్మెల్యే రఘురాం పడాల్ అన్నారు. స్థానిక యువతకు ఇకో రిట్రీట్ నిర్వహణ బాధ్యతలు అప్పగించడం తనకు ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఈ నిర్ణయం వలన యువత ఆర్థికంగా, సామాజికంగా ప్రగతి సాధిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఇకో రిట్రీట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ జగమోహన్ మహాపాత్రో మాట్లాడుతూ.. ప్రశాంతమైన వాతావరణంలో పర్వతంపై అధునాతనంగా 28 కాటేజీలు ఏర్పాటు చేశామని వెల్లడించారు. పర్యాటక కేంద్రానికి వచ్చే పర్యాటకులు ఒడిశా పర్యాటక వెబ్‌సైట్ ఇకో రిట్రీట్‌కు వెళ్లి కాటేజీలు బుక్ చేసుకోవచ్చని వివరించారు. ఒక్కో కాటేజీకి రోజుకు రూ.6 వేల నుంచి రూ.8 వేలు అద్దె ఉంటుందని వెల్లడించారు. పర్వతంపై పర్యాటకుల కోసం హోటల్ ఏర్పాటు ఉందన్నారు. ప్రకృతి అందాలు తిలకించేందుకు వాహనాలు ఏర్పాటు చేయబడతాయని తెలియజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర పర్యాటక విభాగ కార్యదర్శి అనంతనారాయణ సింగ్ నాగురి, పొట్టంగి మాజీ ఎమ్మెల్యే ప్రఫుల్ల పంగి, జిల్లా పరిషత్ అధ్యక్షురాలు సుస్మిత మెలక తదితరులు పాల్గొన్నారు.



ఇకో రిట్రీట్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న అతిథులు



ఏర్పాటు చేసిన అందమైన కాటేజీలు

క్లుప్తంగా

పైడితల్లి హుండీల ఆదాయం లెక్కింపు



వనంగుడిలో హుండీల ఆదాయం లెక్కిస్తున్న సేవకులు

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం పైడితల్లి అమ్మవారి వనంగుడి హుండీల ఆదాయాన్ని గురువారం లెక్కించారు. 19 రోజులకు రూ.8 లక్షల 91వేల 378ల నగదు, 12 గ్రాముల 500 మిల్లీ గ్రాముల బంగారం, 164 గ్రాముల వెండి లభించినట్టు ఆలయ ఈఓ కె.ఎల్.సుధారాణి తెలిపారు.

క్రీడా విజేతలకు కలెక్టర్ అభినందనలు



విజేతలను అభినందిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి, ట్రైనీ కలెక్టర్ వెంకట త్రివినాగ్

విజయనగరం అర్బన్: ఢిల్లీలో ఇటీవల జరిగిన అఖిల భారత ప్రభుత్వ ఉద్యోగుల క్రీడాపోటీల విజేతలను కలెక్టర్ నాగలక్ష్మి తన చాంబర్‌లో గురువారం అభినందించారు. రాష్ట్రజట్లు కబడ్డీ పోటీల్లో తృతీయ స్థానం, ఖోఖో పోటీల్లో ద్వితీయ స్థానం సాధించిన సంగతి తెలిసిందే. ఖోఖో రాష్ట్ర జట్టులో ఆడిన గంట్యాడ మండలం పెదవేమలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పీడీ పి.లక్ష్మీప్రసన్న కుమార్, కబడ్డీ రాష్ట్ర జట్టులో ఆడిన డెంకాడ మండలం రఘుమండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పీడీ కుర్మానభానును కలెక్టర్‌తో పాటు ట్రైనీ కలెక్టర్ వెంకట త్రివినాగ్, డీఈఓ బి.లింగేశ్వరరెడ్డి, డిప్యూటీ ఈఓలు బ్రహ్మాజీ, వాసుదేవరావు, కబడ్డీ అసోసియేషన్ సెక్రటరీ ప్రభావతి, ప్రధానోపాధ్యాయులు కె.సౌభాగ్యలక్ష్మి, ఆదిలక్ష్మి తదితరులు అభినందించారు.

వింతమేక పిల్ల జననం



వింత మేకపిల్ల

సాలూరు: మండలంలో తోణాం పంచాయతీ దిగువమెండంగిలో లాడంగి అప్పలస్వామికి చెందిన పెంపుడు మేకకు వింత మేకపిల్ల గురువారం జన్మించింది. మనిషి తలను పోలిన మేకపిల్ల జన్మించిన కొద్దిసేపటికే మృతి చెందగా, ఖననం చేశారు.

దత్తిరాజేరు పీహెచ్‌సీ సిబ్బంది నిర్వాకం


- కాలంచెల్లిన మందుల పంపిణీ
- గుర్తించడంతో తప్పిన ముప్పు



మందులను చూపిస్తున్న వైద్యాధికారి ఆనంద్‌కుమార్

దత్తిరాజేరు: దత్తిరాజేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని ఆరుగ్రామాల్లోని పదినెలలు దాటిన పిల్లలకు వేసేందుకు (ఎంఆర్) మిసెల్స్ మరియు రూబెల్లా వ్యాక్సిన్‌ను వైద్యసిబ్బంది బుధవారం పంపిణీ చేశారు. పెదకాదలో వ్యాక్సిన్‌ను పి.లక్ష్మికి వేసే సమయంలో వ్యాక్సిన్‌పై తేదీని చూశారు. 2023 జూలై నాటికి కాల పరిమితి అయినట్టు ఉంది. దీనిని గమనించిన ఏఎన్‌ఎంలు గౌరి, చినతల్లి వ్యాక్సిన్ వేయలేదు. వ్యాక్సిన్ పంపిణీపై ఫార్మసిస్ట్ సీతారాంను ప్రశ్నించగా బుధవారం సెలవుపెట్టినట్టు తెలిపారు. వైద్యాధికారి ఆనంద్‌కుమార్ వద్ద 'సాక్షి' ప్రస్తావించగా తన దృష్టికి రాలేదని, ఫ్రిజ్‌లో ఉన్న కాలం చెల్లిన 15 వ్యాక్సిన్ బాటిళ్లను తీసి చూపించారు. బాధ్యులందరికీ నోటీసులిస్తామని డీఎంహెచ్ఓ. భాస్కరరావు డాక్టర్‌ను ఫోన్లో హెచ్చరించారు.

రంగనాథంకు కొండేపూడి పురస్కారం



రాజాం సిటీ: రాజాం రచయితల వేదిక నిర్వాహకులు గార రంగనాథం రచించిన 'రాయ రత్న మంజూష' అనే గ్రంథానికి విశాఖపట్నంకు చెందిన కొండేపూడి సుబ్బారావు సాహితీ పురస్కారం లభించింది. ప్రసన్నభారతి సాహిత్య పురస్కారాలు–2023కు సంబంధించి విమర్శ గ్రంథం/వ్యాససంపుటి విభాగంలో పురస్కారం లభించినట్టు రంనాథం తెలిపారు. డిసెంబర్ నెలలో జరగనున్న ఆంధ్రసాహితీ మహాసదస్సు సాహిత్య సభలో పురస్కారంతో పాటు రూ.5,116లు నగదు అందజేస్తారన్నారు. రంగనాథంకు పురస్కారం లభించడంపై రాజాం రచయితల వేదిక సభ్యులు, పట్టణ ప్రముఖులు అభినందించారు.

'ధరల పెరుగుదలకు ప్రభుత్వాలే కారణం'



ఉల్లిపాయలు విక్రయిస్తున్న కాంగ్రెస్ మహిళా కార్యకర్తలు



మాట్లాడుతున్న మీనాక్షీ బాహిణీపతి

జయపురం: దేశంలో, రాష్ట్రంలో నిత్యావసర వస్తువుల ధరలు పెరగడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలే కారణమని రాష్ట్ర కాంగ్రెస్ సాధారణ కార్యదర్శి మీనాక్షీ బాహిణీపతి ఆరోపించారు. జిల్లా కాంగ్రెస్ భవనం ముందు కొరాపుట్ జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు నళినీ రథ్ పిలుపు మేరకు ఉల్లిగడ్డలు, నిత్యావసర దినుసుల ధరల పెరుగుదలకు నిరసనగా గురువారం ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ధరల నియంత్రణలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం, రాష్ట్రంలోని నవీన్ పట్నాయక్ ప్రభుత్వం పూర్తిగా విఫలమయ్యాయని దుమ్మెత్తిపోశారు. రాష్ట్రంలో గత 24 ఏళ్లుగా పాలిస్తున్న నవీన్ పట్నాయక్ అసమర్థత కారణంగా రాష్ట్ర ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. కేంద్రంలో ప్రధాని నరేంద్రమోదీ కార్పొరేట్ సంస్థలకు కొమ్ముకాస్తున్నారని ధ్వజమెత్తారు. ఆందోళనలో మహిళా కాంగ్రెస్ శ్రేణులతో పాటు పలువురు కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు. అనంతరం ప్రజలకు రూ.30లకే కేజీ ఉల్లిపాయలను విక్రయించారు.

బీజేపీ కృషక్ మోర్చా కార్యవర్గ సమావేశం



సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

పర్లాకిమిడి: స్థానిక ఇరదల వీధిలోని బీజేపీ కార్యాలయంలో ఆ పార్టీ జిల్లా స్థాయి కృషక్ మోర్చా కార్యవర్గ సమావేశం జిల్లా కృషక్ మోర్చా అధ్యక్షుడు ప్రశాంత పాలో ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో వర్షాభావ పరిస్థితుల వలన పంటలు ఎండిపోయి కరువు పరిస్థితులు నెలకొనడంతో, రైతు సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పంటల ఇన్సూరెన్స్, ఇతర సాగునీటి పథకాలు జిల్లాలో అమలు జరిగేటట్లు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కృషక్ మోర్చా అధ్యక్షుడు మహేశ్వర సాహు, సాధారణ కార్యదర్శి ఉపేంద్ర భోంజో, ఎమ్మెల్యే కోడూరు నారాయణరావు, జిల్లా సాధారణ కార్యదర్శి జగన్నాథ మహాపాత్రో తదితరులు పాల్గొన్నారు.

మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ



మొక్కలు నాటుతున్న విద్యార్థులు

రాయగడ: మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమని వక్తలు అన్నారు. ప్రపంచ పొదుపు దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక గోవింద చంద్రదేవ్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో గురువారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా జిల్లా ఫైనాన్షియల్ సర్వీసెస్ అండ్ సేవింగ్స్ అధికారి విశల్ షడంగి మాట్లాడుతూ.. ఆర్థిక పరిస్థితిని మెరుగుపరచడంలో పొదుపు పాత్ర ముఖ్యమన్నారు. మొక్కలు నాటడంతో పాటు సంరక్షించే బాధ్యతలు తీసుకోవాలని పిలుపునిచ్చారు. జీవితంలో ఆర్థిక ఇబ్బందుల నుంచి బయటపడాలంటే సంపాదించిన దాంట్లో కొంత మొత్తం పొదుపు చేయాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో జిల్లా క్రీడా శాఖ అధికారి షేక్ అలీనూర్, జిల్లా సామాజిక భద్రతా అధికారి శ్రీకాంత్ పాణిగ్రహి, ఉన్నత పాఠశాల హెచ్‌ఎం నమిత పదన్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో జపాన్ వైద్య బృందం పర్యటన



సతివాడ పీహెచ్‌సీ ఆవరణలో ఫైలేరియా బాధితులతో జపాన్ వైద్య బృందం ప్రతినిధులు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని సతివాడ ప్రాథమిక ఆస్పత్రి పరిధిలో గల ఒమ్మి, సతివాడ గ్రామాల్లో జపాన్ వైద్యబృందం గురువారం పర్యటించింది. ఈఏఎస్ఏఏ అనే అంతర్జాతీయ సంస్థ గ్రామాల్లో ఫైలేరియా వ్యాధి నివారణ కోసం ఫైలేరియా ఎక్కువగా ఉన్న గ్రామాలను దత్తత తీసుకుంటోంది. ఈ మేరకు ఆ సంస్థ ప్రధాన ప్రతినిధి యమోటో సేన్ తన బృందం సభ్యులతో కలిసి ఒమ్మిలో పర్యటించారు.

ఈ సందర్భంగా గ్రామ పరిసరాలను పరిశీలించి ఫైలేరియా వ్యాధిపై అధ్యయనం చేశారు. ఫైలేరియాతో బాధపడుతున్న రోగులతో మాట్లాడి వారి ఆరోగ్య పరిస్థితులను తెలుసుకున్నారు. అనంతరం ఫైలేరియా నివారణకు చేపట్టాల్సిన చర్యలపై సతివాడ పీహెచ్‌సీ వైద్యులు సాయిరాం, సాయినందినిలతో చర్చించారు. రోగులకు ఇస్తున్న మందుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా యమోటో సేన్ మాట్లాడుతూ ఫైలేరియా రహిత గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని, వ్యాధి నివారణకు ప్రత్యేకంగా మందులు తయారు చేసి ప్రభుత్వాలకు ఉచితంగా పంపిణీ చేస్తున్నామని చెప్పారు. ఫైలేరియా తీవ్రత ఉన్న గ్రామాల్లో పర్యటించి దత్తత తీసుకుంటున్నామని, త్వరలో ఒమ్మి గ్రామంలో వ్యాధి నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపడతామని స్పష్టం చేశారు. అనంతరం సతివాడ పీహెచ్‌సీ ఆవరణలో ఫైలేరియా వ్యాధిగ్రస్తులకు పండ్లు, పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి అంబళ్ల శ్రీరాములు నాయుడు, జపాన్ వైద్యులు నగవే సాన్, నిసికవ్ సాన్, గిరిస్ సాన్, అనిల్ సాన్, జోసెఫ్ సాన్, సర్పంచ్ రేవళ్ల శ్రీనివాసరావు, ఎంపీటీసీ రెడ్డి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రిలో చేరిన మాజీ స్పీకర్ మహేశ్వర్ మహంతి

భువనేశ్వర్: రాష్ట్ర మాజీ స్పీకర్ మహేశ్వర్ మహంతి బుధవారం రాత్రి అస్వస్థతకు గురై స్థానిక ప్రైవేట్ ఆస్పత్రిలో చేరారు. ఆయన బొడొసాంభో ప్రాంతంలో గజలక్ష్మి పూజ వేడుకల్లో పాల్గొన్నారు. ఇంటికి తిరిగి వచ్చిన తర్వాత స్వల్ప అస్వస్థతతో ఇబ్బంది పడడంతో సత్వర చికిత్స కోసం ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ఆయన ఆరోగ్య పరిస్థితి ప్రస్తుతం నిలకడగా ఉందని పూరీ టౌన్ శాఖ బిజూ జనతా దళ్ అధ్యక్షుడు సబ్యసాచి మహాపాత్రా తెలిపారు.

గజలక్ష్మీ దేవికి ఘనంగా పూజలు



కుంకుమ పూజలు నిర్వహిస్తున్న మహిళలు

జయపురం: స్థానిక బంకమఠంలో గజలక్ష్మీ దేవికి గురువారం మహిళలు ఘనంగా కుంకుమ పూజలు జరిపారు. జయపురం ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీపతి గజలక్ష్మీ దేవిని దర్శించుకొని శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. పూజల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

పోక్సో కేసులో మూడేళ్ల జైలు, జరిమానా

విజయనగరం క్రైమ్: పోక్సో కేసుకు సంబంధించిన కేసులో నేరం రుజువు కావడంతో ముద్దాయికి మూడేళ్ల జైలు శిక్ష, రూ.1500 జరిమానా విధిస్తూ కోర్టు తీర్పు చెప్పినట్టు ఎస్పీ ఎం.దీపిక గురువారం తెలిపారు. ముద్దాయి పాడుగు అరవింద్ అలియాస్ హరి బాలికపై లైంగిక దాడికి పాల్పడడంతో టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో పోక్సో యాక్ట్ ప్రకారం ఎస్సై వి.అశోక్ కుమార్ కేసు నమోదుచేసి నిందితుడిని అరెస్టు చేసి, న్యాయ స్థానంలో అభియోగ పత్రం దాఖలు చేశారన్నారు. కేసును ప్రాధాన్యత కేసుల జాబితాలో చేర్చి, ప్రాసిక్యూషన్ త్వరితగతిన పూర్తిచేసి నిందితుడికి శిక్షపడే విధంగా చర్యలు చేపట్టామని తెలిపారు.

ఎమ్మెల్యే ప్రతాప్ జెనాకు ఉపశమనం

- బలవంతపు చర్యలు వద్దు: రాష్ట్ర హైకోర్టు

భువనేశ్వర్: సంచలనం సృష్టించిన మహంగా జంట హత్యల కేసులో బిజూ జనతా దళ్ (బీజేడీ) ఎమ్మెల్యే ప్రతాప్ కుమార్ జెనాకు ఉపశమనం లభించింది. ఒడిస్సా హైకోర్టు గురువారం అతనిపై బలవంతపు చర్యలు నివారించాలని ఆదేశించింది.

ఆయనకు వ్యతిరేకంగా సాలేపూర్ ప్రథమ శ్రేణి జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ (జేఎంఎఫ్‌సీ) కోర్టు నుంచి కేసుకు సంబంధించిన దస్తావేజులను హైకోర్టు కోరింది. ఈ ఏడాది డిసెంబర్ 18న తదుపరి విచారణకు ఈ కోర్టు తేదీని ఖరారు చేసింది. ఆరోగ్య కారణాలతో గత నెల 31న జరగాల్సిన విచారణకు ప్రతాప్ కుమార్ జెనా గైర్హాజరు అయ్యారు. నెల రోజుల పాటు వైద్యులు విశ్రాంతి తీసుకోవాలని తెలియజేసినట్లు తన తరఫు న్యాయవాది కోర్టులో అర్జీ దాఖలు చేశారు.

నిందితుడిగా ఎమ్మెల్యే ప్రతాప్

సాలేపూర్ జేఎంఎఫ్‌సీ ఈ ఏడాది సెప్టెంబర్ 25న జారీ చేసిన ఉత్తర్వుల్లో మహంగా జంట హత్యల కేసులో నిందితుడిగా ఎమ్మెల్యే ప్రతాప్ కుమార్ జెనాపై నేరాలను పరిగణలోకి తీసుకున్నట్లు వెల్లడించింది. ఫిర్యాదుదారు, సాక్షులు మరియు అందుబాటులో ఉన్న ఇతర ఆధారాలు, వాంగ్మూలాలను పరిశీలించిన తర్వాత, జెనాపై భారతీయ శిక్షా స్మృతిలోని 302, 506, 120 – బీ సెక్షన్‌ల కింద నేరాలకు శిక్షార్హమైన ప్రాథమిక కేసును నమోదు చేయాలని కోర్టు ఆదేశించింది. విచారణకు గత నెల 31న న్యాయస్థానంలో ప్రత్యక్షంగా హాజరు కావాలని కోరింది. దీనికి సంబంధించి కోర్టు ప్రత్యేక మెసెంజర్ ద్వారా ఎమ్మెల్యేకు సమన్లు అందజేసింది. అయితే జెనా విచారణకు హాజరు కాకుండా దాట వేశారు. అనారోగ్యం కారణంగా సీఆర్‌పీసీ సెక్షన్ 205 ప్రకారం వ్యక్తిగత హాజరు నుంచి తనకు మినహాయింపు కల్పించాలని ఆయన కోర్టును అభ్యర్థించారు.

ద్విచక్ర వాహనాల నిందితుడు అరెస్టు



చోరీ చేసిన వ్యక్తి, బైక్‌లను చూపిస్తున్న పోలీసులు

పర్లాకిమిడి: స్థానిక రైల్వేస్టేషన్‌లో కొన్ని రోజులుగా మాయమవుతున్న ద్విచక్ర వాహనాల మిస్టరీని ఆదర్శ పోలీసుస్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఇన్‌చార్జి ప్రశాంత భూపతి ఎట్టకేలకు ఛేదించారు. కేసుకు సంబంధించి శ్రీకాకుళం జిల్లా టెక్కలి గ్రామానికి చెందిన హరిశ్చంద్ర బెహరాను అరెస్టు చేసి మూడు ద్విచక్ర వాహనాలు, నకిలీ తాళాలు స్వాధీనం చేసుకున్నారు. వివరాల్లోకి వెళ్తే.. గత నెల 28వ తేదీన గుసాని సమితి అమర గ్రామానికి చెందిన రైపల్లి నర్సింహా అనే వ్యక్తి రైల్వేస్టేషన్‌లోని పార్కింగ్ స్టాండ్‌లో తన ద్విచక్ర వాహనాన్ని ఉంచాడు. అనంతరం తన కుటుంబ సభ్యులను ట్రైన్ ఎక్కించి వచ్చి చూడగా బైక్ కనిపించలేదు. వెంటనే స్థానిక ఆదర్శ పోలీసుస్టేషన్‌లో ప్రాథమిక సమాచారంతో ఫిర్యాదు చేశాడు. ఐఐసీ ప్రశాంత భూపతి కేసును దర్యాప్తు చేసి ఎట్టకేలకు నిందితుడిని అరెస్టు చేశారు. ఆయనపై పలు సెక్షన్లతో కేసు నమోదు చేసి కోర్టుకు తరలించారు.

జూనియర్ డాక్టర్స్ ఆందోళన



ఆందోళనలో పాల్గొన్న జూనియర్ డాక్టర్లు

మల్కన్‌గిరి: జిల్లాలోని కలిమెల ఆరోగ్య కేంద్రంలో పనిచేస్తున్న జూనియర్ డాక్టర్లు ఆరోగ్య కేంద్రం ఎదుట గురువారం ఆందోళన చేపట్టారు. ఆరోగ్య కేంద్రంలో విధులు నిర్వహిస్తున్న ముక్తకాంత్ మల్లిక్‌కు వ్యతిరేకంగా వీరంతా ధర్నా నిర్వహిస్తున్నారు. ఈ మేరకు బుధవారమే జిల్లా వైద్యాధికారి ప్రఫుల్ల కుమార్ నాందో, కలెక్టర్ విశాల్ సింగ్‌కు ఆయనపై ఫిర్యాదు చేశారు. ముక్తకాంత్ ఆరోగ్య కేంద్రంలోని జూనియర్ డాక్టర్లు, ఇతర సిబ్బందితో అసభ్యంగా ప్రవర్తిస్తున్నారని పేర్కొన్నారు. ఆరోగ్య కేంద్రం నుంచి ఆయనను బదిలీ చేయాలని డిమాండ్ చేస్తున్నారు. తన మాట వినని వారిని మారుమూల గ్రామాలకు బదిలీ చేయిస్తానని బెదిరిస్తున్నారని వాపోయారు. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకోకపోతే ఆందోళన కొనసాగిస్తామని హెచ్చరించారు.

బస్సు ఢీకొని విద్యార్థి మృతి



అవినాష్(ఫైల్)

జామి: మండలంలోని భీమసింగి జంక్షన్‌లో ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో గాయపడిన విద్యార్థి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం ఉదయం మృతిచెందాడు. ఈ ఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. భీమసింగి పంచాయతీ చిల్లపాలెం గ్రామానికి చెందిన ఎం.రెడ్డి అప్పలరెడ్డి, భార్య సంతోషి పాతభీమసింగి జంక్షన్‌లో స్వీట్‌బడ్డీ పెట్టుకుని జీవనం సాగిస్తున్నారు. తన తల్లిని బడ్డీ దగ్గర నుంచి ఇంటికి తీసుకువెళ్లడానికి కుమారుడు అవినాష్(14) చిల్లపాలెం నుంచి భీమసింగి బైక్‌పై వెళ్తున్న సమయంలో కొత్త భీమసింగి సమీపంలో విజయనగరం నుంచి అనకాపల్లి వెళ్తున్న ఆర్టీసీ బస్సు బుధవారం రాత్రి ఢీకొనడంతో తీవ్రగాయాలపాలయ్యాడు. వెంటనే 108 వాహనంలో విజయనగరంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం పరిస్థితి విషమంగా ఉండడంతో విశాఖపట్నంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకువెళ్లగా అక్కడ చికిత్సపొందుతూ గురువారం తెల్లవారుజామున మృతిచెందాడు. అవినాష్ కుమరాం జెడ్పీ ఉన్నతపాఠశాలలో 9వతరగతి చదువుతున్నాడు. కుమారుడి మృతితో తల్లిదండ్రులు, ఇతర కుటుంబసభ్యులు శోకసముద్రంలో మునిగిపోయారు. ఈ ఘటనపై కేసునమోదుచేసి విచారణ నిర్వహిస్తామని ఎస్సై వీరబాబు తెలిపారు.

చికిత్స పొందుతూ గుర్తు తెలియని మహిళ..



గుర్తు తెలియని మహిళ మృతదేహం

విజయనగరం క్రైమ్: మండల పరిధిలోని చెల్లూరు బద్దుకొండ పేట పరిసర ప్రాంతాల్లో యాచకురాలు ఈ నెల ఒకటో తేదీన ప్రమాదానికి గురైందని రూరల్ పోలీసులు గురువారం తెలిపారు. 108 అంబులెన్స్ ద్వారా ప్రభుత్వాస్పత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా గురువారం సాయంత్రం 5.30 గంటల సమయంలో మృతిచెందినట్లు రూరల్ ఎస్సై బి.గణేష్ తెలిపారు. దీనిపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ఉత్సవం విజయవంతం

- అమ్మ పండగలో కీలకపాత్ర పోషించిన అష్టలక్ష్ములు
- గణనీయంగా పెరిగిన హుండీ ఆదాయం
- శనివారం ఆలయం వద్ద నుంచి హుకుంపేటకు తరలించనున్న సిరిమాను
- తెప్పోత్సవానికి ఏర్పాట్లు



చదురుగుడిలో పైడితల్లి అమ్మవారు



వనంగుడిలో భక్తులకు దర్శనమిస్తున్న పైడితల్లి అమ్మవారు

విజయనగరం టౌన్: పైడితల్లి అమ్మవారి ఉత్సవాలు ఈ ఏడాది అంగరంగ వైభవంగా జరిగాయి. ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా జిల్లా అధికారయంత్రాంగం శ్రమకు అమ్మవారి ఆశీస్సులు లభించాయి. గతంలో ఎన్నడూ లేనివిధంగా ఈ ఏడాది ఉత్సవంలో ప్రతి ఒక్కరూ తరించారు. అమ్మ పండగ విషయంలో అష్టలక్ష్ములు కీలకపాత్ర పోషించారు. కలెక్టర్ ఎ.నాగలక్ష్మి అందించిన సూచనలు, సలహాలతో అధికారులు చేసిన సేవలు సత్ఫలితాలనిచ్చాయి. ఎస్పీ ఎం.దీపిక పటిష్ట పోలీస్ బందోబస్తు, ఆలయానికి ఎదురుగా కమాండ్ కంట్రోల్ ద్వారా సీసీ ఫుటేజీలు, డ్రోన్ కెమెరాలతో నిఘా, స్వీయపర్యవేక్షణ చేయడంతో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ప్రశాంతంగా ఉత్సవం ముగిసింది. నగర మేయర్ వెంపదాపు విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి సూచనలతో కార్పొరేషన్ అధికారులు, సిబ్బంది చక్కనైన పనితీరు కనబర్చారు. దేవదాయశాఖ జిల్లా సహాయ కమిషనర్ అన్నపూర్ణ అన్ని శాఖల హెచ్‌ఓడీల నుంచి కింది స్థాయి వరకూ అధికారులతో సమన్వయం చేయడంలో తనదైన పాత్ర పోషించారు. అమ్మవారి ఉత్సవం తేదీల ప్రకటన నుంచి ఉత్సవం చివరి వరకూ పైడితల్లి అమ్మవారి దేవస్థానం ఆలయ ఈఓ కె.ఎల్.సుధారాణి తనదైన ముద్రవేశారు. కలెక్టర్ ఆదేశాలతో ఆర్డీఓ సూర్యకళ దర్శన ఏర్పాట్లను పర్యవేక్షించారు. జిల్లా అదనపు ఎస్పీ అస్మాఫరీన్ తౌలేళ్లు, సిరిమానోత్సవం బందోబస్తు విధులు పకడ్బందీగా నిర్వహించడం, సిబ్బందిని సమన్వయం చేయడంలో తనదైన పాత్రపోషించి ఎస్పీ మన్ననలు అందుకున్నారు. ఈ నెల 7వ తేదీన నిర్వహించే తెప్పోత్సవానికి ఆలయ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. అమ్మవారి ఆలయం వద్దనున్న సిరిమానును శనివారం చదురుగుడి వద్ద నుంచి హుకుంపేటలో ఉన్న రాజగోపాల్ టాంపిక్ తరలించనున్నారు.

గణనీయంగా పెరిగిన హుండీ ఆదాయం

పైడితల్లి అమ్మవారి జాతర మహోత్సవాలకు సంబంధించి కేవలం 19 రోజులకే రూ.54 లక్షల నగదు, 88 గ్రాముల బంగారం, 798 గ్రాముల వెండి లభించాయి. గతేడాది 32 రోజులకు సుమారు 49 లక్షల ఆదాయం వచ్చింది.

నేటి నుంచి అండర్-14,17 స్కూల్ గేమ్స్ జిల్లా జట్ల ఎంపిక

విజయనగరం: రాష్ట్రస్థాయిలో నిర్వహిస్తున్న 67వ స్కూల్‌గేమ్స్ క్రీడాపోటీల్లో పాల్గొనే బోయే జిల్లా బాల, బాలికల జట్ల ఎంపిక పోటీలు ఈ నెల 3వ తేదీ నుంచి నిర్వహిస్తున్నట్లు స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి ఎల్‌పీ రమణ తెలిపారు. 3వ హ్యాండ్‌బాల్ క్రీడాంశంలో బాల, బాలికలకు విజయనగరంలోని రాజీవ్ స్టేడియంలో, సెపక్‌తక్రా క్రీడాంశంలో స్థానిక వీటీ అగ్రహారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అండర్ –14, 17 బాల, బాలికలకు ఎంపిక పోటీలు జరుగుతాయని పేర్కొన్నారు. అదేవిధంగా 4న దత్తిరాజేరు మండలంలోని గడసాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నెట్‌బాల్ క్రీడలో అండర్–14,17 విభాగాల్లో బాల, బాలికలకు, గరివిడి మండలం కోనూరు జెడ్పీ హై స్కూల్‌లో ఖోఖో క్రీడకు సంబంధించి అండర్ –14,17 విభాగాల్లో బాల, బాలికల ఎంపిక జరగనుంది. 7న నెల్లిమర్ల మండలం అలుగోలు జెడ్పీ హై స్కూల్‌లో అండర్ –14,17 విభాగాల్లో కబడ్డీ జట్ల ఎంపిక, 10న విజయనగరంలోని రాజీవ్ స్టేడియంలో అండర్ –14, 17 విభాగాల్లో అథ్లెటిక్స్ క్రీడాకారుల ఎంపిక నిర్వహించనున్నామని వివరించారు. అర్హత, ఆసక్తి గల క్రీడాకారులు ఎంపిక పోటీల్లో పాల్గొనవచ్చని, ఆ రోజుల్లో జిల్లా జట్లకు ఎంపికైన క్రీడాకారులు త్వరలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా తరఫున ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు.

4న అండర్-19 నెట్ బాల్, సెపక్ తక్రా జట్ల ఎంపికలు

రాష్ట్ర స్థాయిలో జరగనున్న అండర్–19 బాలబాలికల నెట్‌బాల్, సెపక్ తక్రా పోటీల్లో పాల్గొనబోయే జిల్లా జట్ల ఎంపిక పోటీలు ఈ నెల 4న నిర్వహించనున్నట్లు స్కూల్ గేమ్స్ అసోసియేషన్ కార్యదర్శి పీవీఎల్ ఎన్ కృష్ణ గురువారం తెలిపారు. ఆ రోజు ఉదయం 10 గంటల నుంచి నగరంలోని విజ్జీ స్టేడియం ప్రాంగణంలో నెట్ బాల్ క్రీడాకారుల ఎంపిక, వీటీ అగ్రహారం జెడ్పీ హైస్కూల్ ప్రాంగణంలో సెపక్ తక్రా క్రీడాకారుల ఎంపిక పోటీలు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. అర్హత, ఆసక్తి గల క్రీడాకారులు ఎంపిక పోటీల్లో పాల్గొనవచ్చునని పిలుపునిచ్చారు.

క్లుప్తంగా

అండర్-19 టేబుల్ టెన్నిస్ క్రీడాకారుల ఎంపిక

ఎచ్చెర్ల క్యాంపస్: రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడల్లో పాల్గొనే అండర్-19 టెన్నిస్ క్రీడాకారుల ఎంపిక శుక్రవారం నిర్వహించనున్నట్లు ఎస్‌జీఎఫ్ జిల్లా సెక్రటరీ, దుప్పలవలస అంబేడ్కర్ గురుకుల పాఠశాల పీడీ ఎస్.రమణ తెలిపారు. పాఠశాలలో గురువారం వివరాలు వెల్లడించారు. దుప్పలవలస గురుకుల క్రీడా మైదానంలో మధ్యాహ్నం రెండు గంటలకు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఆసక్తి గల క్రీడాకారులు ఫోన్ నంబర్ 6302546128ను సంప్రదించాలని తెలిపారు.

5న రిటైర్డ్ ఉద్యోగుల సర్వసభ్య సమావేశం

శ్రీకాకుళం కల్చరల్: రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సర్వసభ్య సమావేశం ఈనెల 5న శాంతాకల్యాణ్ అనురాగ నిలయంలో ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నట్లు అధ్యక్షులు ఎంఎస్ఆర్ఎస్ ప్రకాశరావు, కార్యదర్శి పి.నరసింహమూర్తి, ఆర్గనైజింగ్ కార్యదర్శి కె.సోమ సుందర రావులు ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని మండల అధ్యక్ష, కార్యదర్శులు, కార్యవర్గ సభ్యులు సమావేశానికి హాజరు కావాలని కోరారు.

పోషకాల యాజమాన్యం కీలకం

గార: పంటలకు పోషకాల యాజమాన్యం కీలకమని ఆత్మ ప్రాజెక్టు డైరెక్టర్ డాక్టర్ సి.రామచంద్రరావు అన్నారు. శాలిహుండంలో గురువారం ఆత్మ సౌజన్యంతో కలుపు, పోషకాలు, నీటి యాజమాన్యం అవగాహన సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ రైతులు శిక్షణను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అవసరమైన పోషకాలు లేకుండా అవసరం లేనివి వాడటం వల్ల ప్రయోజనం ఉండదన్నారు. కలుపు యాజమాన్యంపై వరి పరిశోధన స్థానం శాస్త్రవేత్త డాక్టర్ పి.అమరజ్యోతి రైతులకు అవగాహన కల్పించారు. సరైన సమయంలో పంటకు నీరు అవసరమని, పాలుపోసుకున్న దశలో నీటి ఎద్దడి లేకుండా చూడాలన్నారు. రబీలో అనువైన రకాలపై, నువ్వుల పంట యాజమాన్యంపై కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త నీలవేణి వివరించారు. జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ అధికారి వై.సూర్యకుమారి, డాక్టర్ మధుకర్, వ్యవసాయాధికారి పద్మావతి పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలు పక్కాగా అమలు కావాలి

ఎచ్చెర్ల క్యాంపస్: ప్రభుత్వ పథకాలు పక్కాగా అమలు కావాలని బీసీ కార్పొరేషన్ ఈడీ ఆర్.గడ్డెమ్మ అన్నారు. పొన్నాడ గ్రామ సచివాలయం-1ను గురువారం గడ్డెమ్మ పరిశీలించారు. ప్రభుత్వ పథకాల అమలుపై సచివాలయ సిబ్బందితో సమీక్షించారు. కాపు నేస్తం, ఈబీసీ నేస్తం, వైఎస్సార్ చేయూత, వైఎస్సార్ పింఛన్ కానుక వంటి పథకాల అమలుపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. వలంటీర్లు తమ పరిధిలో 50 ఇళ్లలో అర్హులను గుర్తించి పథకాలు అమలు చేయాలని తెలిపారు.

5న జిల్లా సబ్‌జూనియర్స్ ఖోఖో జట్ల ఎంపిక

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లా సబ్-జూనియర్స్ బాలబాలికల ఖోఖో జట్ల ఎంపికలు ఈనెల 5వ తేదీన జరగనున్నాయని జిల్లా ఖోఖో అసోసియేషన్ అధ్యక్షులు చిట్టి నాగభూషణం, సీహెచ్ ఫల్గుణరావు తెలిపారు. శ్రీకాకుళం కోడి రామ్మూర్తి స్టేడియం ప్రాంగణం వేదికగా ఆదివారం ఉదయం 9 గంటల నుంచి ఈ ఎంపికల ప్రక్రియ మొదలుకానున్నట్లు చెప్పారు. ఈ ఎంపికల్లో పాల్గొనే బాలబాలికలు 2010 జనవరి ఒకటి తర్వాత జన్మించి ఉండాలని, అలాగే ఎత్తు, బరువు, వయస్సు కలిగి 215 పాయింట్లు మించకూడదని స్పష్టంచేశారు. ఇక్కడ ఎంపిక చేసిన జిల్లా జట్లను ఈనెల 26 నుంచి పల్నాడు జిల్లా నరసారావుపేట వేదికగా జరిగే ఏపీ రాష్ట్రస్థాయి సబ్-జూనియర్స్ బాలబాలికల ఖోఖో చాంపియన్‌షిప్ పోటీలకు పంపించనున్నట్లు వారు పేర్కొన్నారు.

రైలు ప్రమాదంలో విద్యార్థి

ఇచ్ఛాపురం: పురుషోత్తపురం రైల్వే ఎల్‌సీ గేట్ వద్ద గురువారం జరిగిన రైలు ప్రమాదంలో మండలంలోని ముచ్చింద్ర గ్రామానికి చెందిన సాడి చిరంజీవి(17) అనే విద్యార్థి మృతి చెందాడు. చిరంజీవి పట్టణంలోని ఆదర్శ పాఠశాలలో ఇంటర్మీడియెట్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. విద్యార్థి మృతితో ముచ్చింద్ర గ్రామంతో పాటు ఆదర్శపాఠశాలలో విషాద ఛాయలు అలముకున్నాయి.

చిన్నారులకు టీచర్ల సాయం



చిన్నారుల వైద్యానికి ఆర్థిక సాయం చేస్తున్న డీఎస్సీ-2018 ఉపాధ్యాయుల బృందం

ఇచ్ఛాపురం రూరల్: బోన్‌మేరో వ్యాధితో బాధపడుతున్న కవల పిల్లలు శివంగి హర్షవర్ధన్, హర్షితల శస్త్ర చికిత్సకు సాయం అందించాలంటూ సోమవారం సాక్షిలో ప్రచురితం అయిన 'చిన్ని ప్రాణాలకు ఆపద' కథనానికి 'డీఎస్సీ-2018 తెలుగు సేవాసమితి ఉపాధ్యాయులు' బృందం స్పందించింది. ఉపాధ్యాయ బృందం గురువారం కేశుపురం గ్రామానికి వెళ్లి చిన్నారుల వైద్యానికి కుటుంబ సభ్యులకు రూ. 16,000 నగదుతో పాటు పండ్లు అందజేశారు. డొంకూరు ఉన్నత పాఠశాల హెచ్‌ఎం ఎస్.సరోజిని, సీవీఆర్, వెంకటేశ్వరరావు, స్వాతి, నూకయ్య, లోకనాథంలు చిన్నారులను పరామర్శించిన నగదు అందజేసిన వారిలో ఉన్నారు.

దారులు విశాలం.. ఊరికి కుశలం



పునర్నిర్మాణం జరగనున్న సోంపేట మండలం ఎగువూరు-ఎస్‌హెచ్-5 రోడ్డు



జీటీ రోడ్డుగా మారనున్న రణస్థలం మండలం వెంకట్రావుపేట కూడలి నుంచి రావాడ రహదారి

- జిల్లాలో ఏడు చోట్ల హై ఇంపాక్ట్ రోడ్ల నిర్మాణానికి చర్యలు
- రద్దీగా ఉండే గ్రామీణ రహదారులను గుర్తించిన పంచాయతీ రాజ్ శాఖ
- 3 నియోజకవర్గాల్లో రూ.11.72 కోట్లతో రహదారుల నిర్మాణం
- పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ శాఖ పర్యవేక్షణలో ప్రారంభం కానున్న పనులు

అరసవల్లి: పల్లె దారులు మారనున్నాయి. ముఖ్యమైన గ్రామీణ రహదారులను పూర్తిస్థాయి విస్తరణతో తారు రోడ్లుగా మార్చేందుకు సన్నాహాలు మొదలయ్యాయి. దీని కోసం పంచాయతీ రాజ్ ఉన్నతాధికారులు టెండర్ల ప్రక్రియకు కూడా శ్రీకారం చుడుతున్నారు. బిడ్లను ఆన్‌లైన్ ద్వారా ఆహ్వానించనున్నారు. జిల్లాలోని ఇచ్ఛాపురం, పాతపట్నం, ఎచ్చెర్ల తదితర నియోజకవర్గాల్లో ప్రధానంగా రద్దీగా ఉండే రహదారులను పూర్తి స్థాయి నాణ్యతతో పాటు రద్దీకి అనుగుణంగా విస్తరించి పునర్నిర్మించనున్నారు. మొత్తం ఏడు రహదారులను గుర్తించిన పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారులు రూ.11.72 కోట్లతో పునర్నిర్మాణం చేసేందుకు టెండర్ల ప్రక్రియ మొదలుపెట్టారు. ఆయా ప్రాంతాల్లో ప్రయాణికులకు, వాహన చోదకులకు కూడా ఇరుకు రహదారుల కష్టాలు తప్పనున్నాయి.

రద్దీ రహదారుల గుర్తింపు

గ్రామీణ ప్రాంతాల్లో ఒకప్పటి పరిస్థితులు లేవు. వాహనాల సంఖ్య విపరీతంగా పెరగడంతో చాలా రోడ్లు ఇరుకైపోయాయి. జాతీయ, రాష్ట్ర హోదాల్లో ఉన్న ప్రధాన రహదారుల్లో ఉన్నట్లే జిల్లాలో పలు గ్రామీణ రహదారుల్లో ఈ మధ్య కాలంలో వాహనాల రద్దీ పెరిగినట్లుగా అధికారులు గుర్తించారు. అలాగే ముఖ్య ప్రదేశాలకు, మండల కేంద్రాలకు తరచుగా రాకపోకలు సాగించే క్రమంలో కూడా పలు రహదారులు రద్దీగా మారుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక సాంకేతికత సహాయంతో గూగుల్ మ్యాప్‌ల ద్వారా సరిగ్గా ఇలాంటి 258 రహదారులను హై ఇంపాక్ట్ రోడ్లుగా గుర్తించి, వెంటనే ఈ రహదారుల్లో ప్రయాణాలను మరింత సౌకర్యవంతంగా నాణ్యతగా పునర్నిర్మాణం చేసేలా అడుగులు వేస్తోంది. అవసరమైన చోట వంతెనలు, మట్టి రోడ్ల స్థానే తారు రోడ్లు వేసేలా ప్రణాళికలు వేసి టెండర్ల ప్రక్రియ పూర్తి కాగానే పనులు ప్రారంభించనున్నారు.

వచ్చేనెల నుంచి పనులు ప్రారంభం



జిల్లాలో హై ఇంపాక్ట్ రోడ్లుగా మొత్తం ఏడింటిని గుర్తించి రూ.11.72 కోట్లతో పునర్నిర్మాణ పనులు చేసేందుకు నిర్ణయించారు. రద్దీగా ఉండే గ్రామీణ రహదారులను గుర్తించి టెండర్లు పిలవనున్నారు. ఈనెల 6 నుంచి ఆన్‌లైన్‌లో బిడ్లు వేసేలా ప్రభుత్వ ఉత్తర్వులు జారీ చేశారు. 14 రోజుల పాటు గడువు ముగియగానే.. టెండర్లు ఖరారు చేసిన అనంతరం వచ్చే నెల మొదటి వారం నుంచే పనులు ప్రారంభించేలా చర్యలు చేపడతాం.

– పీఎస్ఎన్.మూర్తి, ఎస్ఈ, పంచాయతీరాజ్

జిల్లాలోని హైఇంపాక్ట్ రహదారులివే..

- ఇచ్ఛాపురం నియోజకవర్గం: సోంపేట మండలం పాత జాతీయ రహదారి (ఎస్‌హెచ్-5) నుంచి ఎకువూరు (వయా బట్టిగొల్లూరు)- 4.60 కిలోమీటర్లు- రూ.2 కోట్లు.
- పాతపట్నం నియోజకవర్గం: మెళియాపుట్టి మండలం ఎంఎం రోడ్డు నుంచి పెద్ద లక్ష్మీపురం - 1.30 కిలోమీటర్లు - రూ.32.50 లక్షలు.
- ఎచ్చెర్ల నియోజకవర్గం: లావేరు మండలం వెంకటాపురం నుంచి అదపాక (వయా గోవిందపురం)- 6.50 కిలోమీటర్లు- రూ.3.12 కోట్లు.
- జి.సిగడాం మండలం గంగన్నదొరపాలెం నుంచి దేవరవలస- 2.40 కిలోమీటర్లు - రూ.1.35 కోట్లు.
- జి.సిగడాం మండలం పాగిరి కూడలి నుంచి పెంట గ్రామం - 2.32 కిలోమీటర్లు - రూ.1.30 కోట్లు.
- జి.సిగడాం మండలం జగన్నాథవలస నుంచి కొయ్యాన పేట - 1.85 కిలోమీటర్లు - రూ.1.13 కోట్లు.
- రణస్థలం మండలం వెంకట్రావ్‌పేట కూడలి నుంచి రావాడ (వయా ఉప్పివలస) - 4.10 కిలోమీటర్లు - రూ.2.50 కోట్లు.



కిడ్నీ రీసెర్చ్ సెంటర్ లోగో విడుదల



ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మించిన కిడ్నీ రీసెర్చ్‌సెంటర్, 200 పడకల ఆస్పత్రి, డయాలసిస్ సెంటర్ మరికొద్ది రోజుల్లో ప్రారంభం కానున్నాయి. ఈ సందర్భంగా ఆస్పత్రి యాజమాన్యం లోగోను తయారు చేసి ఆస్పత్రి వద్ద ప్రదర్శించింది. రెండు కిడ్నీలను రెండు చేతులతో రక్షిస్తూ ఉండటంతో పాటు మధ్యలో వైద్యానికి సంబంధించిన గుర్తు, పచ్చని ఉద్దానం ప్రాంతానికి గుర్తుగా ఆకులు, వాటి మధ్యలో పలాస, లోకాసమస్తా సుఖినోభవంతు అంటూ అద్భుతమైన లోగోను విడుదల చేశారు.

– కాశీబుగ్గ

గంగమ్మ కోసం..



మండలంలోని కె.కపాసుకుద్దిలో గురువారం శ్రీరామలింగేశ్వరస్వామికి వర్షాల కోసం భక్తులు సహస్ర ఘటాభిషేకాన్ని నిర్వహించారు. సీహెచ్‌కపాసుకుద్ది, కె కపాసుకుద్ది, ప్రగడపుట్టుగ, ముత్యాలపేట, కొరికానపుట్టుగ తదితర గ్రామాలకు చెందిన సుమారు 2000 మంది భక్తులు ఈ ఉత్సవంలో పాల్గొన్నారు.

– కవిటి

డిసెంబర్ రెండో శనివారం జాతీయ లోక్ అదాలత్

శ్రీకాకుళం పాతబస్టాండ్: డిసెంబర్ నెల రెండో శనివారం తొమ్మిదో తేదీన జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా తెలిపారు. ఈ అదాలత్‌లు జిల్లా కేంద్రంతో పాటుగా ఆమదాలవలస, కోటబొమ్మాళి, నరసన్నపేట, పాలకొండ, పలాస, రాజాం, పాతపట్నం, సోంపేట, టెక్కలి, ఇచ్ఛాపురం, కొత్తూరు, పొందూరు కోర్టుల్లో నిర్వహిస్తామని పేర్కొన్నారు. రాజీ పడదగ్గ క్రిమినల్ కేసులు అన్ని రకాల సివిల్ కేసులు, బ్యాంకు కేసులు, మోటార్ ప్రమాద కేసు, ప్రీ లిటిగేషన్ కేసులు రాజీ చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జ్ ఆర్.సన్యాసినాయుడు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా

వేసవికి పక్కాగా పవర్



గురువారం లావేరులో పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను పరిశీలిస్తున్న ఎస్ఈ కృష్ణమూర్తి తదితరులు

అరసవల్లి: వేసవిలో విద్యుత్ సమస్యలను అధిగమించడానికి ప్రభుత్వం ఇప్పటి నుంచే చర్యలు ప్రారంభించింది. సర్కిల్ ఎస్ఈ ఎస్.కృష్ణమూర్తి ఆధ్వర్యంలో అధికారుల బృందం జిల్లాలో విద్యుత్ అవసరాలకు అనుగుణంగా ప్రతిపాదనలు సిద్ధం చేసి ఉన్నతాధికారులకు నివేదించగా.. ఈ క్రమంలో రూ.1.20 కోట్లతో లావేరులోనూ, మరో రూ.1.20 కోట్లతో కేశవరావుపాలెంలోనూ 5 ఎంవీఏ (మెగా ఓల్ట్ యాంపియర్) సామర్థ్యం గల పవర్ ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేశా. ఈ మేరకు గురువారం లావేరులో పీటీఆర్ ఏర్పాటు పనులను స్వయంగా ఎస్ఈ కృష్ణమూర్తి పరిశీలించారు. సంబంధిత ఈఈ బయ్యన్నాయుడు, రాజశేఖరం, డిప్యూటీ ఈఈలు రమణమూర్తి, పైడి యోగేశ్వర రావు, చల్లా వెంకటేశ్వరరావులతో పాటు కాంట్రాక్టర్ ఉంగటి పాపారావుతో పనుల పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. వేగంగా పనులు పూర్తి చేయడంపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ క్రమంలో మరో రెండ్రోజుల్లో కేశవరావుపాలెంలో పనులు కూడా పూర్తి చేయనున్నట్లుగా ప్రకటించారు. అతిత్వరలో గార మండలం చల్లపేట, రణస్థలం సమీపంలో పిసినిలో కూడా మరో రెండు పవర్ ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నామని ఎస్ఈ కృష్ణమూర్తి తెలియజేశారు.

వేసవి కష్టాలే లేకుండా

జిల్లాకు ఏటా విద్యుత్ డిమాండ్ క్రమేణా పెరుగుతూ వస్తోంది. వ్యవసాయ విద్యుత్‌తో పాటు విపరీతంగా ఏసీల వినియోగం పెరగడంతో విద్యుత్ డిమాండ్‌కు మించి వినియోగం నమోదవుతోంది. అయితే సబ్‌స్టేషన్ల వరకు 33 కేవీ విద్యుత్ సరిపడా ఉంటున్నా.. 11కేవీ పవర్‌గా కన్వర్ట్ కావడంలో పవర్ ట్రాన్స్‌ఫార్మర్ల పాత్ర కీలకం కావడంతో తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ ఆధ్వర్యంలో జిల్లాలో అవసరమైన మేర విద్యుత్ సరఫరాకు అన్ని రకాల చర్యలు చేపట్టనున్నారు. ఈ క్రమంలో పవర్ ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాట్లు వేసవికి ముందే చేయడంలో అధికారులు సఫలయ్యారు. సమ్మర్ యాక్షన్ ప్లాన్‌లో భాగంగా గత ఏడాది జిల్లాలో ఏ ప్రాంతాల్లో 60 శాతానికి పైగా విద్యుత్ డిమాండ్ తలెత్తిందో..అలాంటి ప్రాంతాల్లో తక్షణమే పవర్ ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేస్తున్నారు. ఇవే కాకుండా జిల్లా కేంద్రంలో త్వరలో పొన్నాడ బ్రిడ్జి వద్ద 132 కేవీ సబ్‌స్టేషన్ ఏర్పాటు కానుండడంతో జిల్లా కేంద్రానికి విద్యుత్ అవసరాలు దాదాపుగా తీరిపోతాయి. నగరంలో పీఎన్ కాలనీ, విశాఖ-ఎ కాలనీల్లో కూడా సబ్‌స్టేషన్ల నిర్మాణానికి అడుగులు పడుతున్నాయి.

విద్యార్థుల సామర్థ్యమెంత..?

- 3,6,9 తరగతుల విద్యార్థులకు సామర్థ్య నిర్ధారణ పరీక్షలు
- నేడు జిల్లావ్యాప్తంగా సీస్ సర్వే
- జిల్లాలో 1223 పాఠశాలలు ఎంపిక



పరీక్షకు ప్రిపేర్ అవుతున్న విద్యార్థులు

ఇచ్ఛాపురం రూరల్, సారవకోట: అమ్మ ఒడి పేదలకు భరోసా ఇచ్చింది. ఇంగ్లిష్ మీడియం ప్రభుత్వ స్కూళ్లపై ఉన్న అభిప్రాయాలను చెరిపేసింది. నాడు-నేడు సర్కారు పాఠశాలల్లో సదుపాయాలు పెంచింది. ఇన్ని చర్యల తర్వాత పాఠశాలల్లో విద్యార్థుల సామర్థ్యాలు ఏ మేరకు ఉన్నాయో తెలుసుకునేందుకు సర్కారు సన్నద్ధమవుతోంది. స్టేట్ ఎడ్యుకేషన్ అచీవ్‌మెంట్ సర్వే(సీస్)ను శుక్రవారం జిల్లా వ్యాప్తంగా నిర్వహించనున్నారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో 3,6,9 తరగతులు చదువుతున్న విద్యార్థులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిపి ఈ సర్వే నిర్వహిస్తాయి. సర్వేకు సంబంధించి విద్యార్థులు ఇప్పటికే ప్రాక్టీసును ప్రారంభించారు. ఆయా మండల విద్యావనరుల కేంద్రాలకు పరీక్ష పేపర్లు కూడా చేరుకున్నాయి.

1332 మంది ఫీల్డ్ ఇన్వెస్టిగేటర్ల నియామకం

'సీస్' సర్వే నిర్వహించేందుకు జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు యాజమాన్యాల పరిధిలోని 1223 పాఠశాలలను ఎంపిక చేసింది. విద్యార్థుల్లో అభ్యసన ఫలితాలు (లెర్నింగ్ అవుట్ కమ్స్) ఏ విధంగా ఉన్నాయో తెలుసుకునేందుకు నిర్వహించే సర్వేకు ఫీల్డ్ ఇన్వెస్టిగేటర్లను (ఎఫ్ఎస్ఐ) నియమించారు. ప్రభుత్వ, ప్రైవేటు, డిగ్రీ, ఇంజినీరింగ్, డైట్ కళాశాల విద్యార్థులు 1332 మందిని జిల్లా విద్యాశాఖ ఎఫ్ఎస్ఐలుగా నియమించింది. వీరికి ఇప్పటికే డివిజన్ స్థాయిలో శిక్షణ సైతం ఇచ్చారు. జిల్లా విద్యాశాఖాధికారి పర్యవేక్షణలో జరగనున్న పరీక్షలను డీసీఈబీ సెక్రటరీ, లెక్చరర్, డీఈఓ కార్యాలయ ప్రతినిధి, ప్రభుత్వ పరీక్షల విభాగం అసిస్టెంట్ కమిషనర్ పరిశీలిస్తారు. మండల స్థాయిలో ఎంఈఓ-1, ఎంఈఓ-2లతో పాటుగా స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎంలు 64 మంది సర్వే నిర్వహణను పర్యవేక్షిస్తారు.

ఓఎంఆర్ విధానంలో

'సీస్' సర్వేలో భాగంగా 3, 6, 9 తరగతుల విద్యార్థులకు ఇప్పటికే మోడల్ పరీక్షలు నిర్వహించారు. పరీక్ష ఓఎంఆర్ విధానంగా ఉంటుంది. 3,6 తరగతుల విద్యార్థులకు ప్రధానంగా ఫౌండేషన్ లిటరసీ అండ్ న్యూమరసీపై పరీక్ష ఉంటుంది. 9వ తరగతికి తెలుగు, ఇంగ్లిష్, గణితం, సోషల్, సైన్స్ సబ్జెక్టులపై పరీక్ష నిర్వహిస్తారు.

ముఖ్యాంశాలు

6, 9 తరగతి విద్యార్థులకు గత సంవత్సరం సిలబస్‌పై పరీక్ష నిర్వహిస్తారు. జిల్లా వ్యాప్తంగా ఎంపిక చేసిన 1223 పాఠశాలల్లో 31167 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. ఉదయం 10.30 గంటలకు పరీక్షలు ప్రారంభమయ్యే పరీక్షల్లో 3వ తరగతి విద్యార్థులకు 60 నిమిషాలు, 6వ తరగతి విద్యార్థులకు 75 నిమిషాలు, 9వ తరగతి విద్యార్థులకు 90 నిమిషాలు సమయాన్ని కేటాయిస్తారు.

తప్పిన పెను ప్రమాదం

నందిగాం/కాశీబుగ్గ: నందిగాం మండలం పెద్దబాణాపురం గ్రామం వద్ద గురువారం స్కూలు పిల్లలకు పెద్ద ప్రమాదం తప్పింది. పెద్దబాణాపురం గ్రామం నుంచి ఆరుగురు విద్యార్థులతో జాతీయ రహదారిపైకి వచ్చిన ఆటో కొత్తగ్రహారం వద్ద మరో ఇద్దరిని ఎక్కించుకుని పెద్ద బాణాపురం పెద్ద చెరువు సమీపానికి వచ్చే సరికి మహేంద్ర సుప్రో వాహనాన్ని తప్పించబోయి బోల్తా పడింది. అప్పటికే ఆటో వెనుక ఓ ఆయిల్ ట్యాంకర్ వస్తోంది. అదృష్టవశాత్తు ఆటో రోడ్డు మధ్యకు వెళ్లకుండా పక్కగుండా బోల్తా పడడంతో విద్యార్థులకు పెను ప్రమాదం తప్పింది. దీనిపై నందిగాం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ప్రమాదం జరిగిన వెంటనే ఆటోలో ఉన్న విద్యార్థులకు అక్కడ ఉన్న వారు బయటకు తీసి జాతీయ రహదారి అంబులెన్స్‌లో పలాస ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చినబడం సాయికిరీషా పాఠశాలకు చెందిన హేమకుమారికి ఎముకలు విరిగింది. సూర్యతేజ జూనియర్ కళాశాలకు చెందిన హారికకు కూడా పెద్ద దెబ్బలే తగిలాయి. ఆటోడ్రైవర్ గుండెకు స్టీరింగ్ తగలడంతో శ్వాసతీసుకోవడం ఇబ్బందిగా మారడంతో వీరందరికి వైద్య సేవలు అందిస్తున్నారు. పలాస ఎంఈఓ శ్రీనివాసరావుతో పాటు ఆయా పాఠశాలల యాజమాన్యం వచ్చి విద్యార్థులను పరామర్శించారు.

పురుషోత్తపురం చెక్‌పోస్టుపై ఏసీబీ దాడి

ఇచ్ఛాపురం: ఆంధ్రా-ఒడిశా సరిహద్దులోని పురుషోత్తపురం ఇంటిగ్రేటెడ్ చెక్‌పోస్టు వద్ద గల మోటార్ వెహికల్ కార్యాలయంపై అవినీతి నిరోధక శాఖ అధికారులు గురువారం ఆకస్మికంగా దాడి చేశారు. ఈ దాడిలో రూ.1.30 లక్షల సొమ్ము అనధికారికంగా ఉన్నట్లు గుర్తించారు. వివరాల్లోకి వెళ్తే.. స్థానిక చెక్‌పోస్టులోని ఎంవీఐ సిబ్బంది అవినీతికి పాల్పడుతున్నారని వచ్చిన ఫిర్యాదుల మేరకు శ్రీకాకుళం, విజయనగరం ఏసీబీ సిబ్బంది ఏసీబీ డీఎస్పీ బీవీఎస్ఎస్ రమణమూర్తి నేతృత్వంలో దాడులకు సిద్ధమయ్యారు. ఐదుగురు సీఐలు, ఇద్దరు ఎస్ఐలు, సిబ్బందితో బుధవారం అర్ధరాత్రి దాటాక 1.30 గంటలకు దాడులు చేశారు. దీనిపై ఏసీబీ డీఎస్పీ మాట్లాడుతూ ఈ దాడుల్లో ఎంవీఐ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న ముగ్గురు సిబ్బంది ఏఎంవీఐ అనిల్‌కుమార్, ఇద్దరు కానిస్టేబుళ్లు రమణ, ఈశ్వరరావుల వద్ద నుంచి రూ.లక్షా30వేల అనధికార సొమ్ముని గుర్తించామన్నారు. జూలై నుంచి రాష్ట్రంలోని అన్ని చెక్‌పోస్టుల్లో ప్రభుత్వం నగదు రహిత లావాదేవీలు ప్రారంభించిందని, అయినా ఇక్కడ సిబ్బంది అనధికార వసూళ్లకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు తమకు వచ్చాయన్నారు. ఈ దాడుల్లో దొరికిన సొమ్మును సీజ్ చేసి నివేదికను తయారు చేసి ఏసీబీ ఉన్నతాధికారులకు నివేదిక సమర్పించనున్నారు. ఈ ఏడాది జూలై నెలలో ఇదే చెక్‌పోస్టుపై ఏసీబీ సిబ్బంది ఆకస్మికంగా దాడి చేసి రూ.2.20 లక్షలు స్వాధీనం చేసుకున్నారు. తాజా దాడుల్లో సీఐలు రమణ, హరి, మహేశ్వరరావు, శ్రీనివాసరావు, వెంకటరమణ, ఎస్ఐలు ఇస్మాయిల్, వాసు నారాయణ సిబ్బంది పాల్గొన్నారు.



ఏసీబీ డీఎస్పీ రమణమూర్తి ఆధ్వర్యంలో చెక్‌పోస్టులో సోదాలు చేస్తున్న ఏసీబీ బృందం

ఏపీ ఈఏపీ సెట్ బైపీసీ స్ట్రీమ్ కౌన్సెలింగ్ షెడ్యూల్ విడుదల

ఎచ్చెర్ల క్యాంపస్: ఏపీ ఈఏపీసెట్-2023 బైపీసీ స్ట్రీమ్ కౌన్సెలింగ్ షెడ్యూల్‌ను సాంకేతిక విద్యాశాఖ విడుదల చేసినట్లు శ్రీకాకుళం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్, హెల్ప్‌లైన్ సెంటర్ సమన్వయకర్త గురుగుబెల్లి దామోదర్‌రావు తెలిపారు. కళాశాలలో గురువారం వివరాలు వెల్లడించారు. బైపీసీ స్ట్రీమ్‌లో బీటెక్ బయోటెక్నాలజీ, ఫుడ్ టెక్నాలజీ, బీ. ఫార్మసీ, ఫార్మా డీ కోర్సుల్లో ప్రవేశాలు జరగుతాయని చెప్పారు. ఈ నెల 14వరకు కౌన్సెలింగ్ కొనసాగుతుందని అన్నారు. ఈ నెల 8వ తేదీ లోపు ఆన్‌లైన్ ఫీజు చెల్లింపు, రిజిస్ట్రేషన్, ఈ నెల 9 నుంచి 11వ తేదీ వరకు ఆన్‌లైన్ వెరిఫికేషన్, సర్టిఫికెట్ల అప్‌లోడ్, 11 నుంచి 13 వరకు ఆప్షన్ల ఎంపిక, 14న ఆప్షన్ల మార్పు ఉంటుందని అన్నారు. 17న అలాట్‌మెంట్ల ప్రకటన, 18 నుంచి 21 మధ్య సెల్ఫ్ రిపోర్టింగ్ కళాశాలలకు చేయవల్సి ఉంటుందని చెప్పారు. విద్యార్థులు పూర్తి వివరాలు, కౌన్సెలింగ్ కోసం హెచ్‌టీటీపీఎస్://సెట్స్.ఏపీఎస్‌సీహెచ్ఈ. ఏపీ.జీవోవీ.ఇన్ వెబ్ సైట్ లింక్ సంప్రదించాలని సూచించారు. పూర్తిస్థాయి ధ్రువీకరణ పత్రాలు అప్‌లోడ్ చేయాలని అన్నారు. ప్రత్యేక కేటగిరీ విద్యార్థులకు విజయవాడ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో పరిశీలన ఉంటుందని చెప్పారు. దివ్యాంగులు, చిల్డ్రన్ ఆఫ్ ఆర్మ్‌డ్ పర్సన్, స్పోర్ట్స్ అండ్ గేమ్స్, స్కౌట్ గైడ్, నేషనల్ క్యాడెట్ కాంప్స్, ఆంగ్లో ఇండియన్, ఈ నెల 10,11 తేదీ ల్లో ప్రత్యేక కేటగిరీల ధ్రువీకరణ పత్రాల పరిశీలన ఉంటుందని చెప్పారు. సెట్ అర్హత సాధించిన విద్యార్థులు కౌన్సెలింగ్ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

పులి అలజడి

సోంపేట: కంచిలి, సోంపేట మండలవాసులను పులి భయపెడుతోంది. తాజాగా గురువారం సోంపేట మండలం బెంకిలి గ్రామంలో అలజడి సృష్టించింది. బారువ, పలాస ఎఫ్ఎస్ఓలు వై.రాజేంద్ర,బీబీ రెడ్డి బెంకిలి గ్రామంలో పర్యటించి పులి అడుగులు నిర్ధారించుకుని ప్రజలను అప్రమత్తం చేశారు. బెంకిలి గ్రామానికి చెందిన తామాడ గణేష్ బుధవారం రాత్రి 7 గంటల సమయంలో పొలానికి నీరు పెట్టడానికి బైక్‌పై వెళ్తే పులి కనిపించిందని చెప్పాడు. పులి కనిపించిన వెంటనే పక్కన చెట్టు ఎక్కి అక్కడి నుంచే తల్లిదండ్రులకు ఫోన్ చేశాడు. తొలుత దీన్ని ఎవరూ నమ్మలేదు. అయితే అటవీ శాఖాధికారులు గణేష్ చెప్పిన స్థలం వద్దకు వెళ్లి చూస్తే పులి అడుగులు కనిపించాయి. దీంతో అక్కడి ప్రజలను అప్రమత్తం చేశారు. బెంకిలి పరిసర గ్రామాల్లోని ప్రజలు సాయంత్రం 5 నుంచి ఉదయం 6 గంటల వరకు బయటకు రావద్దని, పశువులను సురక్షిత ప్రాంతాల్లో ఉంచుకోవాలని సూచించారు.

కర్తలిపాలెంలో..

కర్తలిపాలెంలో బుధవారం రాత్రి గ్రామానికి చెందిన బి.రామస్వామి అనే రైతుకు చెందిన ఆవును పులి చంపేసింది. గురువారం ఉదయం తోటకు వెళ్లిన రైతుకు ఆవు కళేబరం కనిపించడంతో అధికారులకు విషయం చెప్పారు. వారు వచ్చి పులి దాడిలో ఆవు మృతి చెందినట్లు నిర్ధారించారు. ఈ రెండు ఘటనలతో నియోజకవర్గ ప్రజలు భయపడుతున్నారు. పొలాలకు నీరు పెట్టేందుకు ఎక్కువ మంది రైతులు వెళ్తున్నారని, పులి భయం వల్ల నీరు పెట్టడం వీలు కావడం లేదని చెబుతున్నారు. బారువ, పలాస ఎఫ్ఎస్ఓలు వై.రాజేంద్ర, బీబీ రెడ్డి మాట్లాడుతూ బుధవారం రాత్రి కంచిలి మండలం మండపల్లి వద్ద నుంచి బయల్దేరిన పులి సోంపేట మండలం బెంకిలి గ్రామం మీదుగా కర్తలిపాలెం వరకు చేరుకున్నట్లు ప్రస్తుతం గుర్తించామన్నారు. శుక్రవారం ఉదయానికి పూర్తి నిర్ధారణ జరుగుతుందన్నారు.



బెంకిలిలో పులి పాదముద్ర

కంచిలి: ఉద్దానం గ్రామాల్లో పులిసంచారంపై ఆందోళన కొనసాగుతోంది. మండపల్లి, తలతంపర, కుత్తుమ పంచాయతీ ప్రజలకు కేటాయించిన జగనన్న కాలనీ స్థలం కొండ ప్రాంతం నుంచి కవిటి-సోంపేట మెయిన్‌రోడ్డు మీదుగా పులి రోడ్డు క్రాస్ చేస్తూ ఉండగా తాము చూశామని బొరివంక గ్రామంలో గల ఏపీజీబీ బ్యాంకు సిబ్బంది గౌతమ్, సాయి చెబుతున్నారు. మొబైల్‌లో ఫొటోలు కూడా తీశారు. అదే సమయంలో సోంపేట మండలం బెంకిలి గ్రామంలో పంట పొలాల్లో పెద్ద పులిని చూసినట్లు ఓ యువకుడు చెప్పారు. ఈ విభిన్న కథనాలతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. అటవీ శాఖాధికారులే జనం అయోమయాలను తొలగించాలని కోరుతున్నారు.



కర్తలిపాలెంలో ఆవు మృతదేహం వద్ద అటవీశాఖాధికారులు